STUDY ABROAD
TOP GLOBAL DESTINATIONS
Free IELTS coaching
GradsUniverse
+91 6301726400

ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ఆదిలాబాద్ 17-05-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 361
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar, Guntur & Warangal
Follow us on

## ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, మే 16 :**

దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు విశ్వాస ఘాతుకమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అయన ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ధరల పెంపు నిర్ణయం సామాన్యుల పాలిట పిడుగుపాటు లాంటిదని చెప్పారు. ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరలను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరిచారని సీఎం విమర్శించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ముందు "ధరలు పెంచబోం" అని పదే పదే ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా కాకముందే ఈ నిర్ణయం తీసుకోవడం ముమ్మాటికీ ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని విమర్శించారు. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని సీఎం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్న సీఎం... పదేళ్లుగా రూపాయి విలువ పతనం పరాకాష్టకు చేరిందని ఆరోపించారు. 'ఆత్మనిర్భర్ భారత్' అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదం గానే మిగిలిపోయిందని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని యువత ఉపాధి కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకునే కేంద్రం ఈ పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.


## నీట్ పేపర్ లీకేజ్‌లో దర్యాప్తు ముమ్మరం

### రెండవ ప్రధాన సూత్రధారి అరెస్టు

**నీట్-యూజీ బయాలజీ పేపర్‌ను లీక్ చేసినట్లు గుర్తించిన సీబీఐ**

- ఇప్పటికే పుణేకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ అరెస్టు
- పుణేకు చెందిన ఒక సీనియర్ మహిళా బాటనీ లెక్చరర్ కూడా అరెస్టు

> పత్రాల లీకేజీ దర్యాప్తులలో ఎన్‌టీఏలోనే లీకేజీ మూలాన్ని కనుగొనడం ఇదే మొదటిసారి. పత్రం లీకయి, దాని పీడీఎఫ్‌లు మెసేజింగ్ గ్రూపుల్లోకి వెళ్ళాక, వందలాది మంది లబ్ధి పొంది ఉండవచ్చు. మేమందరినీ గుర్తించి పట్టుకుంటాం, కానీ ముందుగా లీకేజీ మూలం, వారి సహచరులపై పనిచేస్తున్నాం, అని ఒక అధికారి అన్నారు. గతంలో జరిగిన ఏవైనా పేపర్ లీక్‌లలో కులకర్ణి, మంధారేల పాత్రపై కూడా ఏజెన్సీ దర్యాప్తు చేస్తోందని అధికారులు తెలిపారు. కులకర్ణి తరగతుల తర్వాత ఆ పేపర్ ఏయే మార్గాల ద్వారా ప్రయాణించిందో కూడా సీబీఐ గుర్తించింది. నాసిక్‌కు చెందిన శుభం ఖైర్నార్, ఏప్రిల్‌లో గురుగ్రామ్‌కు చెందిన యశ్ యాదవ్‌తో మాట్లాడుతూ, అధికారిక రికార్డులు, కోర్టు పత్రాలలో మంగిలాల్ బివాల్, మంగిలాల్ ఖటిక్ అని పేర్కొన్న మంగిలాల్ అనే వ్యక్తి తన చిన్న కొడుకు కోసం లీకైన పేపర్ల కొరకు రూ. 10-12 లక్షలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.




**వుదయం డెస్క్, మే 16 :**

నీట్ 2026 ప్రశ్నా పత్రాల లీకేజీ కేసులో, ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న రెండవ వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) అరెస్టు చేసిందని సీనియర్ అధికారులు తెలిపారు. దర్యాప్తు అధికారులు ఈ రాకెట్‌కు 'కింగ్‌పిన్'గా అభివర్ణించిన పదవీ విరమణ పొందిన రసాయనశాస్త్ర అధ్యాపకుడు పి.వి. కులకర్ణిని అరెస్టు చేసిన మరుసటి రోజే, ఎన్‌టిఏ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యురాలిగా ఉన్న పుణేకు చెందిన ఒక సీనియర్ మహిళా వృక్షశాస్త్ర (బాటనీ) ఉపాధ్యాయురాలిని సిబిఐ అరెస్టు చేసింది. విశదమైన దర్యాప్తు అనంతరం మనీషా గురునాథ్ మంధారేను అరెస్టు చేసినట్లు సిబిఐ శనివారం మిగతా 2లో..

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

- నిన్న లీటర్‌పై రూ.3 పెంపు
- సమీప భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం
- దశలవారీగా రూ.10 పెంచే అవకాశం




**హైదరాబాద్, మే 16 :**

భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. మిగతా 2లో..

## త్రిభాష తప్పనిసరి : సీబీఎస్ఈ




9, 10వ తరగతి విద్యార్థులకు మూడు భాషల అధ్యయనం

భాషా ఉపాధ్యాయుల కోసం తాత్కాలిక చర్యలకు అనుమతి

5 లో..

## రూ. 182 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల పట్టివేత



'ఆపరేషన్ రేజ్ పిల్'లో భాగంగా, జిహాదీ డ్రగ్‌గా ప్రసిద్ధి చెందిన కాప్టగాన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) తొలిసారి స్వాధీనం చేసుకుంది.

5 లో..

## పనులు పరుగులు పెట్టాలి

- మలక్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మే 16 :**

హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి మిగతా 2లో..

## వచ్చే నెల 25 నుంచి ఎస్ఐఆర్

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్, మే 16 :**

వచ్చే నెల 25 నుంచి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు ప్రత్యేక సర్వే చేస్తారని చెప్పారు. శనివారం హైదరాబాద్ లో ఆహన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారన్నారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు 'Book a Call with BLO' సదుపాయం కల్పించినట్లు చెప్పారు. మరోవైపు.. ఎన్యుమరేషన్ మిగతా 2లో..

## పార్టీ మారాలనుకునే వారెళ్లొచ్చు

### టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఎఎంఎస్) :**

పశ్చిమబెంగాల్ లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పరాజయం పాలైంది. ఎన్నికల్లో ఓటమిపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో ఉండాలనుకునేవాళ్లు ఉండొచ్చని, వద్దనుకునేవాళ్లు వెళ్లిపోవచ్చని ఆమె పేర్కొన్నట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలు వెలువడుతోన్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమత సమావేశమయ్యారు. ఇందులో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీ మళ్లీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 'పార్టీ మారాలనుకునే వారిని మిగతా 2లో..



## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

- దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాల అప్రమత్తం
- నాలుగు బృందాలతో హైదరాబాద్, కరీంనగర్, ఢిల్లీలో గాలింపు
- ఏ క్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశం



**హైదరాబాద్, మే 16 :**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం మిగతా 2లో..

## యువతను అభివృద్ధి చెందిన భారతదేశ మూల స్తంభాలుగా చూస్తాను

- నా వ్యాఖ్యలు తప్పుగా ఉటంకించారని సిజెఐ స్పష్టీకరణ
- నకిలీ న్యాయ డిగ్రీలు ఉన్నాయనే ఆరోపణల సంఖ్య పెరిగింది



**వుదయం డెస్క్, మే 16 :**

యువకులు బొద్దింకల వంటివారు అంటూ తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి నెలకొన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తూ, తన మౌఖిక వ్యాఖ్యలను తప్పుగా ఉటంకించారని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శనివారం స్పష్టం చేశారు. నకిలీ లేదా బోగస్ డిగ్రీలను ఉపయోగించి న్యాయవాద వృత్తి వంటి రంగాల్లోకి ప్రవేశించిన వారిని ఉద్దేశించే తాను ఆ విమర్శలు చేశానని ఆయన పేర్కొన్నారు.

శుక్రవారం, నకిలీ న్యాయ డిగ్రీలు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాదుల సంఖ్యపై సీజేఐ కాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను, ఇతరులను లక్ష్యంగా చేసుకుని సమాజంలో ఇప్పటికే చాలా మంది పరాన్నజీవులు ఉన్నారని, న్యాయవాదులు అటువంటి శక్తులతో చేతులు కలపకూడదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు, మిగతా 2లో..

## 'బండి'ని పదవి నుంచి తొలగించాలి

- ఆయన కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన పదవిలో ఉండొద్దు
- ప్రధాని మోడీ కి టీఆర్ఎస్ చీఫ్ కవిత లేఖ



**హైదరాబాద్, మే 16 :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన్ను మంత్రి వర్గం నుంచి తొలగించాలంటూ ప్రధాని మోడీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడి మిగతా 2లో..

## హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ సర్వే కొలిక్కి

- నల్లమల అడవులు, సోమశిల మీదుగా బుల్లెట్ రైలు
- తెలంగాణలో 5 హైస్పీడ్ రైల్వే స్టేషన్లు
- ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాంతాల గుండా సాగేలా సరికొత్త రూట్ మ్యాప్




**హైదరాబాద్, మే 16 :**

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ ప్రాజెక్టుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. రెండు ఐటీ మహానగరాల మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ప్రతిపాదించిన ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక ఎలైన్‌మెంట్ సర్వే ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు ప్రతిష్ఠాత్మక బుల్లెట్ రైలు కారిడార్లలో ఒకటైన ఈ మార్గం.. ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాంతాల గుండా సాగేలా సరికొత్త రూట్ మ్యాప్ సిద్ధమవుతోంది. తెలంగాణలో ప్రారంభమై ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగుతూ కర్ణాటక రాజధాని బెంగళూరులో మిగతా 2లో..



# జాతీయం-అంతర్జాతీయం



## వారు తీవ్రవాదులు కాదు - సుప్రీం

- **నోయిడా నిరసనల సందర్భంగా అరెస్టైన కార్యకర్తలను మే 18న హాజరుపరచాలని యుపి ప్రభుత్వానికి ఆదేశం**



**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**

నోయిడాలో ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా అరెస్టు అయిన ఇద్దరు కార్యకర్తలు, ఆదిత్య ఆనంద్, రూపేష్ రాయ్ ను మే 18న మధ్యాహ్నం 2 గంటలకు తమ ముందు హాజరుపరచాలని సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదిత్య ఆనంద్ సోదరుడైన కేశవ్ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ ఉత్తర్వును కోర్టు జారీ చేసింది. తన సోదరుడిని యూపీ పోలీసులు కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని కేశవ్ తన పిటిషన్‌లో ఆరోపించారు.

ఉగ్రవాదులుగా పరిగణించలేం: సుప్రీంకోర్టు

జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం యూపీ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఆ ఇద్దరు కార్మికులను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. ఆ ఇద్దరూ కేవలం అధిక వేతనాల కోసం నిరసన తెలుపుతున్నారని, వారిని ఉగ్రవాదులుగా పరిగణించాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది.

వారు ఉగ్రవాదులు కాదు, కేవలం కనీస వేతనాలు వంటి ప్రాథమిక హక్కులను డిమాండ్ చేస్తున్నారు అని ప్రభుత్వ న్యాయవాదితో న్యాయమూర్తి నాగారత్న అన్నారు. వామపక్ష భావజాలాన్ని అనుసరించినంత మాత్రాన ఎవరూ ఉగ్రవాదిగా మారిపోరు అని కూడా కోర్టు పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వం వారిని పోలీసు కస్టడీకి తరలించాలని యోచిస్తోందన్న ఆందోళనను వారి న్యాయవాది వ్యక్తం చేసిన తర్వాత, ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ కస్టడీలోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది.

ఆదిత్య ఆనంద్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, రూపేష్ ఒక ఆటో డ్రైవర్ ఆదిత్య ఆనంద్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా, రాయ్ ఒక ఆటో డ్రైవర్. వీరిద్దరూ ఇటీవల నోయిడాలో జరిగిన కార్మికుల నిరసనలో పాల్గొన్నారు. ఆదిత్య ఆనంద్‌ను తిరుచిరాపల్లి రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. అతని ఆచూకీకి సంబంధించిన ఏ సమాచారాన్ని అందించినా రూ. 1 లక్ష నగదు బహుమతిని ఇస్తామని ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రకటించారు. తాను ఎన్ ఐటి జంషెడ్‌పూర్ నుండి బిటెక్ పట్టా పొందినట్లు అతను పేర్కొంటున్నాడు.

రూపేష్ రాయ్ ఒక ఆటోరిక్షా డ్రైవర్. ఏప్రిల్ 17న అతను అరెస్టు చేయబడ్డాడు. ఒక రోజు తర్వాత ఆనంద్ కూడా అరెస్టు అయ్యాడు. మూడవ వ్యక్తిగా, మనీషా చౌహాన్ అనే మహిళను కూడా యుపి పోలీసులు అరెస్టు చేశారు.

యుపి పోలీసుల ప్రకారం, గత నెలలో నోయిడాలో కార్మికులు నిర్వహించిన ధర్నా వెనుక సూత్రధారి ఆదిత్య ఆనంద్. నోయిడాలో జరిగిన కార్మికుల నిరసనల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక కార్యకలాపాలను ఆయనే నడిపించారని సమాచారం. ఈ నిరసనల సందర్భంలో జరిగిన రెచ్చగొట్టే చర్యలను ప్రణాళిక రచించి, అమలు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పోలీసులు తెలిపారు.

కస్టడీలో హింసించారన్న ఆరోపణలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. అరెస్టుకు గల కారణాన్ని తెలియజేయడంతో సహా, అరెస్టుకు సంబంధించిన అన్ని నిబంధనలను వారు పాటించారని యూపీ ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయినప్పటికీ, మే 18న ఆ ఇద్దరినీ తమ ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది.

## 9, 10 తరగతులకు మూడు భాషలను తప్పనిసరి చేసిన సీబీఎస్ఈ







**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**

విద్యా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ), 202627 విద్యా సంవత్సరం నుంచి 9 10వ తరగతుల భాషా విధానంలో కీలక మార్పులను ప్రకటించింది. మే 15, 2026న జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో, ఈ సవరించిన విధానం జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020, పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం (ఎన్‌సిఎఫ్ఎస్ఇ) 2023లకు అనుగుణంగా రూపొందించినట్టు బోర్డు పేర్కొంది.

నోటిఫికేషన్ ప్రకారం, జూలై 1, 2026 నుండి 9, 10వ తరగతి విద్యార్థులకు ఆర్1, ఆర్2, ఆర్3 అనే మూడు భాషల అధ్యయనం తప్పనిసరి అవుతుంది. ఈ భాషలలో కనీసం రెండు భాషలు భారతీయ స్థానిక భాషలై ఉండాలని కూడా బోర్డు స్పష్టం చేసింది.

9, 10వ తరగతులకు భాషా విధానాన్ని సవరించిన సిబిఎస్ ఇ

202627 విద్యా సంవత్సరానికి సంబంధించి, 9, 10వ తరగతుల కోసం ఇటీవల విడుదలైన ఎన్‌సిఆర్‌టి సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు పేర్కొంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇప్పటికే ఏప్రిల్ 2026లో ప్రారంభమైనప్పటికీ, దీని అమలు కోసం ఒక 'పరివర్తనాత్మక విధానాన్ని' అనుసరిస్తామని సిబిఎస్ ఇ తెలిపింది.

సవరించిన భాషా విధానం ప్రకారం, విదేశీ భాషను అభ్యసించాలనుకునే విద్యార్థులు, తాము ఎంచుకున్న ఇతర రెండు భాషలు భారతీయ స్థానిక భాషలైతేనే ఆ విదేశీ భాషను ఎంచుకోవడానికి వీలుంటుంది. విదేశీ భాషలను అదనపు నాలుగవ భాషగా కూడా అభ్యసించవచ్చు.

భాషా విద్యకు సంబంధించిన నవీకరించిన పాఠ్యప్రణాళిక లక్ష్యాలు, సామర్థ్యాలు, అభ్యాస ఫలితాలను క్షుణ్ణంగా సమీక్షించాలని సిబిఎస్ ఇ తన అనుబంధ పాఠశాలలన్నింటినీ ఆదేశించింది.

బోధనా వనరులపై మార్గదర్శకాలు

మధ్య దశ, మాధ్యమిక దశ విద్యల మధ్య పఠన అవగాహన, మౌఖిక సంభాషణ, వ్యాకరణం, రచన నైపుణ్యాల వంటి భాషా సామర్థ్యాలలో దాదాపు 75 నుండి 80 శాతం సారూప్యత ఉందని ఈ సర్క్యులర్ ప్రముఖంగా పేర్కొంది.

ఆర్3 కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చేంత వరకు, 202627 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి విద్యార్థులు తాము ఎంచుకున్న భాషకు సంబంధించిన 6వ తరగతి ఆర్3 పాఠ్యపుస్తకాలనే వినియోగిస్తారు. ఈ పాఠ్యపుస్తకాలకు అదనంగా, కవితలు, చిన్న కథలు, కల్పిత రచనలతో సహా స్థానిక లేదా రాష్ట్ర స్థాయి సాహిత్య సామగ్రిని కూడా జోడించి బోధించాలని పాఠశాలలను కోరడం జరిగింది.

ఈ అనుబంధ సామగ్రి ఎంపిక, బోధనాపరమైన వినియోగానికి సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను జూన్ 15, 2026 నాటికి జారీ చేస్తామని సిబిఎస్ ఇ తెలిపింది.

భాషా ఉపాధ్యాయుల కోసం తాత్కాలిక చర్యలకు అనుమతి

ఈ పరివర్తన కాలంలో స్థానిక భారతీయ భాషల కోసం అర్హతగల ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంలో కొన్ని పాఠశాలలు ఇబ్బందులు ఎదుర్కోవచ్చని బోర్డు అంగీకరించింది.

సహోదయ క్లస్టర్ల ద్వారా పాఠశాలల మధ్య వనరుల పంపిణీ, హైబ్రిడ్ బోధనా సహాయం, పదవీ విరమణ చేసిన భాషా ఉపాధ్యాయులను వినియోగించుకోవడం, తగిన అర్హతలు గల పోస్ట్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవడం వంటి సౌకర్యవంతమైన ఏర్పాట్లను ఉపయోగించుకోవడానికి సీబీఎస్ఈ పాఠశాలలను అనుమతించింది. 9 షెడ్యూల్డ్ భాషలలోని 6వ తరగతి ఆర్3 పాఠ్యపుస్తకాలు జూలై 1, 2026లోపు పాఠశాలలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కూడా బోర్డు తెలిపింది.

## తీరు మార్చుకోకుంటే పాక్ అస్తిత్వానికే ముప్పు

**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**



పాకిస్తాన్ భౌగోళిక, చారిత్రక భాగస్వామిగా ఉండాలనుకుంటోందా లేదా అనేది నిర్ణయించుకోవాలంటూ, భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం నాడు పాకిస్తాన్‌కు ఒక గట్టి సందేశాన్ని పంపారు. న్యూఢిల్లీలోని మాణెక్‌షా సెంటర్‌లో జరిగిన ఒక ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ, గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'కు దారితీసిన పరిస్థితులే మళ్లీ తలెత్తితే భారత సైన్యం ఎలా స్పందిస్తుందని అడిగిన ప్రశ్నకు జనరల్ ద్వివేదిని స్పందించారు.

నేను ఇంతకుముందు చెప్పినది మీరు విని ఉంటే, పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే, వారి అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది, అని ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ బదులిచ్చారు.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన వైమానిక దాడులైన 'ఆపరేషన్ సింధూర్' మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకున్న వారం రోజుల తర్వాత జనరల్ ద్వివేది ఈ వ్యాఖ్యలు చేశారు.సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామని పేర్కొన్నారు. పొరుగుదేశం తన తీరును మార్చుకోకుంటే ఆ ఆపరేషన్‌కు సంబంధించిన రెండో వెర్షన్ తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపైనే దృష్టిపెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని అన్నారు.

ఏడాదికి పైగా నిలిచిపోయిన భారతదేశంతో చర్చలను తిరిగి ప్రారంభించగలమనే ఆశాభావాన్ని ఇటీవల వ్యక్తం చేసిన పాకిస్తాన్‌కు, ఈ వ్యాఖ్యలు ఒక సూటి సందేశంగా నిలిచాయి.

పాకిస్థాన్ చర్చలకు సుముఖం

భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య చర్చలకు ద్వారం ఎప్పుడూ తెరిచే ఉండాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) నాయకుడు దత్తాత్రేయ హోసబాలే చేసిన వ్యాఖ్యకు, భారత మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే మద్దతు తెలపడాన్ని పాకిస్థాన్ గురువారం స్వాగతించింది.

ఒక పత్రికా సమావేశంలో, పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ అంద్రాబి మాట్లాడుతూ, భారతదేశంలో చర్చల కోసం వస్తున్న పిలుపులను తాను ఒక సానుకూల పరిణామంగా చూస్తున్నానని, అయితే ఆ వ్యాఖ్యలపై ఏదైనా అధికారిక స్పందన వస్తుందో లేదో చూడాల్సి ఉందని అన్నారు.

**ఆపరేషన్ సింధూర్**

ఏప్రిల్ 22న జరిగిన ఘోరమైన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా, గత సంవత్సరం మే 7వ తేదీ తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించారు. భారత బలగాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లోని పలు ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లు, ఇతర సంబంధిత మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించాయి.

పాకిస్తాన్ కూడా భారతదేశంపై దాడులను ప్రారంభించింది. ఇవి దాదాపు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. ఆ తర్వాత న్యూఢిల్లీ చేపట్టిన ప్రతి దాడులన్నీ కూడా 'ఆపరేషన్ సింధూర్' పరిధిలోనే నిర్వహించారు.

అణు ఆయుధాలు కలిగిన ఈ రెండు పొరుగు దేశాల మధ్య దాదాపు 88 గంటల పాటు సాగిన ఈ సైనిక ఘర్షణ, మే 10 సాయంత్రం ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత నిలిచిపోయింది. పాకిస్తాన్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డిజిఎంఒ) తన భారతీయ డిజిఎంఒపే సంప్రదించి, కాల్పుల విరమణను కోరడంతో ఈ ఒప్పందం కుదిరిందని భారత సైన్యం వెల్లడించింది.

## విజయ్ వద్ద కీలక శాఖలు

- **మంత్రులకు శాఖలు కేటాయింపు**
- **ఎన్.ఆనంద్‌కు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కేటాయింపు**
- **అదవ అర్జునకు పబ్లిక్ వర్క్స్, క్రీడల అభివృద్ధి శాఖలు**



**వుదయం డెస్క్, మే 16:**

తమిళనాడు ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం ప్రకటన విడుదల చేసింది. విజయ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు లోక్ భవన్ శాఖలను కేటాయించింది.

ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను వుంచుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు, పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను ఆదవ్ అర్జునకు, ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు, ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ. సెంగొట్టయ్యన్‌కు అప్పగించారు.

ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కు, స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు,మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు, ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను ఎస్.కీర్తనకు అప్పగించారు.

## సైకిల్‌పై కార్యాలయానికి కేంద్ర మంత్రి టోకన్ సాహు

- **ఇంధనాన్ని పొదుపుగా వాడాలని పౌరులకు పిలుపు**
- **మనం ఆదా చేసే ప్రతి చుక్క ఇంధనంతో భారత భవితకు, గౌరవానికి భద్రత**

**వుదయం డెస్క్, మే 16:**

ఇంధన పొదుపు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపునకు మద్దతుగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయమంత్రి టోకన్ సాహు ఈ రోజు తన నివాసం నుంచి సంకల్ప్ భవన్ వరకు 3 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించారు. తద్వారా సుస్థిర పట్టణ రవాణా, పర్యావరణ బాధ్యత, దేశ సేవ గురించి పౌరులకు బలమైన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగామాట్లాడుతూ... వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ తరగతులు, వీడియో అనుసంధానం ద్వారా సమావేశాలు, పెట్రోల్‌డీజిల్ వినియోగాన్ని తగ్గించడం వంటి కోవిడ్‌కాలపు పద్ధతులను పునరుద్ధరించాలని ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తిని సాహు గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో అది అత్యంత సముచితం, సందర్భోచితమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు దేశ ప్రయోజనాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిని దేశ సేవగా భావిస్తూ, ఈ సామూహిక కృషిలో పాలు పంచుకోవడం బాధ్యత గల ప్రతీ పౌరుడి విధి అని టోకన్ సాహు ఉద్ఘాటించారు.



ఇంధన పొదుపు కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదనీ... పర్యావరణం పట్ల మన బాధ్యత, క్లిష్ట సమయాల్లో దేశాన్ని బలోపేతం చేయగల సామూహిక జాతీయ కర్తవ్యమని సాహు స్పష్టం చేశారు. "మనం ఆదా చేసే ప్రతి లీటరు ఇంధనం దేశ విస్తృత ప్రయోజనాలకు దోహదపడుతుందన్నారు. దేశం సమష్టిగా సుస్థిరత, స్వయంసమృద్ధి దిశగా ముందుకుసాగుతున్న తరుణంలో చిన్నవైనప్పటికీ... అవగాహనతో కూడిన జీవనశైలి మార్పుల ద్వారా పౌరులు అర్థవంతమైన సహకారం అందించగలరు" అని ఆయన అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆదర్శంగా తీసుకుని కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను 50 శాతం తగ్గించడం ప్రారంభించారని సాహు పేర్కొన్నారు. వ్యక్తిగత ఆచరణ ద్వారా నాయకత్వం ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతుందనీ... అది విస్తృత ప్రజా భాగస్వామ్యానికి స్ఫూర్తినిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజా భాగస్వామ్యం, దేశభక్తి గురించిన విస్తృత సందేశాన్ని అందిస్తూ... "పొదుపు దిశగా వేసే ప్రతి అడుగు దేశ సేవ దిశగా ఒక ముందడుగు అవుతుంది. మనం ఆదా చేసే ప్రతి చుక్క ఇంధనం భారత భవితను, గౌరవాన్ని పరిరక్షిస్తుంది" అని సాహు పేర్కొన్నారు.

ఈ ఉద్యమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ... ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ బస్సులు వాడడం, సైకిల్ తొక్కడం, సాధ్యమైన చోట్ల కార్‌పూలింగ్‌ను ఉపయోగించుకోవడం ద్వారా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని సాహు పౌరులకు విజ్ఞప్తి చేశారు.

## లాక్‌డౌన్‌పై కిరణ్ రిజిజు క్లారిటీ

**వుదయం డెస్క్, మే 16:**



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. దాదాపు అన్ని దేశాలు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం భారత్ కూడా కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. పౌరులంతా పొదుపు పాటించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.తాజాగా ఇదే అంశంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే లాక్‌డౌన్‌పై కూడా స్పందించారు. లాక్‌డౌన్ లేదు.. కానీ భారత్ మాత్రం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదని.. లాక్‌డౌన్ వంటి పరిస్థితులు రావని స్పష్టం చేశారు. అయితే ప్రపంచ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భారత్ ముందస్తుగా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## రూ. 182 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల పట్టివేత

**వుదయం డెస్క్, మే 16:**

'ఆపరేషన్ రేజ్ పిల్‌లో భాగంగా, జిహాదీ డ్రగ్‌గా ప్రసిద్ధి చెందిన కాప్టగాన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) తొలిసారి స్వాధీనం చేసుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం తెలిపారు. దీని విలువ రూ. 182 కోట్లు. ఈ చర్యను ఒక పెద్ద విజయంగా అభివర్ణిస్తూ, మధ్యప్రాచ్యానికి తరలిస్తున్నట్లు ఆరోపించిన సరుకును స్వాధీనం చేసుకోవడం, అలాగే ఒక విదేశీయుడిని అరెస్టు చేయడం వంటివి మాదకద్రవ్యాలపై ప్రభుత్వ జీరోటాలరెన్స్ విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని షా అన్నారు.

భారతదేశంలోకి ప్రవేశించే లేదా భారతదేశం గుండా ప్రయాణించే ప్రతి గ్రాము మాదకద్రవ్యంపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని షా ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో నొక్కిచెప్పారు. ఈ ఆపరేషన్‌ను నిర్వహించిన ఎన్‌సిబి అధికారులను ప్రశంసించారు.

**.అధికారులు క్యాప్టగాన్‌ను ఎలా గుర్తించారు?**

క్యాప్టగాన్ అక్రమ రవాణాకు భారతదేశాన్ని ఒక రవాణా మార్గంగా ఉపయోగిస్తున్నారని ఒక విదేశీ మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ అందించిన నిఘా సమాచారం ఆధారంగా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో న్యూఢిల్లీలోని నెబ్ సరాయ్‌లో ఉన్న ఒక అద్దె ఇంటిని గుర్తించింది. మే 11, 2026న నిర్వహించిన సోదాతో, సౌదీ అరేబియాలోని జెడ్డాకు ఎగుమతి చేయడానికి ఉద్దేశించినట్లు ఆరోపితమైన, ఒక వాణిజ్య చపాతీ కోసే యంత్రంలో దాచి ఉంచిన సుమారు 31.5 కిలోల క్యాప్టగాన్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిని మరింతగా విచారించగా, గుజరాత్‌లోని ముంద్రాలో ఉన్న కంటైనర్ ఫెసిలిటేషన్ స్టేషన్ (సిఎఫ్ఎస్) వద్ద నిలిపి ఉంచిన ఒక కంటైనర్ వద్దకు దర్యాప్తు అధికారులు చేరుకున్నారు. అక్కడ మే 14, 2026న అధికారులు దాదాపు 196.2 కిలోల క్యాప్టగాన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిరియా నుండి దిగుమతి చేసుకుని, గొర్రెల ఉన్నిని తీసుకువెళ్తున్నట్లుగా ప్రకటించిన ఆ కంటైనర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, మాదక ద్రవ్యం ఉన్న మూడు సంచులను కనుగొన్నారు.

క్యాప్టగాన్ దుర్వినియోగం ఒక ప్రధాన శాంతిభద్రతల, ప్రజారోగ్య సవాలుగా మారిన గల్ఫ్ దేశాలకు, ముఖ్యంగా సౌదీ అరేబియా, పొరుగున ఉన్న మధ్య ప్రాచ్య దేశాలకు ఈ సరుకును తరలించడానికి ఉద్దేశించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

భారతదేశపు తొలి క్యాప్టగాన్ స్వాధీనం

ఈ ఆపరేషన్ భారతదేశపు మొట్టమొదటి క్యాప్టగాన్ స్వాధీనమని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు దేశాన్ని ఒక రవాణా కేంద్రంగా ఉపయోగించుకోవడానికి అంతర్జాతీయ మాదకద్రవ్య సిండికేట్లు చేస్తున్న ప్రయత్నాలను ఇది ఎత్తిచూపుతోందని అధికారులు తెలిపారు. బహుళ అధికార పరిధులలో



పనిచేస్తున్న అంతర్జాతీయ మాదకద్రవ్య ముఠాలను నిర్మూలించడంలో ప్రపంచవ్యాప్త నిఘా సమాచార మార్పిడి, సమన్వయంతో కూడిన చట్ట అమలు ప్రయత్నాల ప్రాముఖ్యతను కూడా ఈ కేసు నొక్కి చెబుతోంది.

ఇది, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కోసం అంతర్జాతీయ మాదకద్రవ్య సిండికేట్లు వాణిజ్య సరుకు రవాణా, కంటైనర్ వ్యాపార మార్గాలను దుర్వినియోగం చేస్తున్న ధోరణి పెరుగుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**కాప్టగాన్ అంటే ఏమిటి?**

కాప్టగాన్ అనేది వాస్తవానికి ఫెనెథిలైన్ అనే పదార్థానికి ఉన్న బ్రాండ్ పేరు. ఇది 1960లలో ఎడిహెచ్‌డి, నార్కోలెప్సీ వంటి రుగ్మతలకు చికిత్స అందించేందుకు అభివృద్ధి చేసిన ఒక కృత్రిమ ఉత్ప్రేరకం (సింథెటిక్ స్టిమ్యులెంట్). దీనికి బానిసయ్యే ప్రమాదం అధికంగా ఉండటం, దుర్వినియోగమయ్యే అవకాశం ఉండటం వల్ల, 1980ల నాటికి ఈ ఔషధం అంతర్జాతీయంగా నిషేధించబడింది.

నేడు, నల్లబజారులో అక్రమంగా విక్రయించబడుతున్న కాప్టగాన్ మాత్రలలో, రహస్య ప్రయోగశాలల్లో తయారు చేసిన, ఆంఫెటమైన్, మెథామెఫటమైన్, కెఫైన్ ఇతర కృత్రిమ ఉత్ప్రేరకాల మిశ్రమాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.పశ్చిమ ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో, పెరిగిన చురుకుదనం, ఎక్కువసేపు మేల్కొని ఉండటం, అలసట తగ్గడం, దూకుడు స్వభావం పెరగడం వంటి ఉత్తేజపరిచే, ఉల్లాసకరమైన ప్రభావాల కోసం ఈ మందును విరివిగా దుర్వినియోగం చేస్తారు. దీనిని పదేపదే వాడటం వలన విచక్షణ కోల్పోవడం, ఆవేశపూరిత ప్రవర్తన, మానసిక ఆధారపడటం వంటివి కూడా ఏర్పడవచ్చు. దీనిని తరచుగా పేదవాడి కొకైన్ అని పిలుస్తారు.

**దీనిని జిహాదీ డ్రగ్ అని ఎందుకు పిలుస్తారు?**

పశ్చిమ ఆసియాలోని సంఘర్షణ పీడిత ప్రాంతాలలో పనిచేస్తున్న తీవ్రవాద నెట్‌వర్క్‌లకు, దీని అక్రమ రవాణాకు మధ్య సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల కారణంగా, అంతర్జాతీయ భద్రతా చర్చలలో క్యాప్టగాన్‌ను తరచుగా జిహాదీ డ్రగ్ అని పిలుస్తుంటారు.

సంవత్సరాల పాటు జరిగిన దర్యాప్తుల లో, ఇరాక్ , సిరియా ఇస్లామిక్ స్టేట్‌తో సహా పలు మిలిటెంట్ గ్రూపులు, తమ యోధులను ఎక్కువసేపు మేల్కొని ఉంచడానికి, భయం, అలసటను అణచివేయడానికి, తీవ్రమైన పోరాట కార్యకలాపాలను కొనసాగించడానికి ఈ ఉత్ప్రేరకాన్ని ఉపయోగించాయని ఆరోపణలు వెల్లడయ్యాయి.

పశ్చిమ ఆసియాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మాదకద్రవ్యాల ముప్పులలో ఒకటిగా క్యాప్టగాన్ వ్యాపారాన్ని అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఇందులో రహస్య తయారీ కేంద్రాలు, హవాలా ఫైనాన్సింగ్, నకిలీ వ్యాపార పత్రాలు, అధునాతన అక్రమ రవాణా మార్గాలు ఇమిడి ఉన్నాయి. చారిత్రాత్మకంగా సిరియాను అక్రమ క్యాప్టగాన్ ఉత్పత్తికి ఒక ప్రధాన కేంద్రంగా పరిగణిస్తున్నారు.

అధికార వర్గాల సమాచారం ప్రకారం, క్యాప్టగాన్ అక్రమ రవాణా ద్వారా ఆర్జించిన భారీ లాభాలను, తీవ్రవాద సంబంధిత నెట్‌వర్క్‌లకు నిధులు సమకూర్చడానికి కూడా వినియోగించినట్లు తెలుస్తోంది.



